

ప్రభుత్వాధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి

ఎంఎల్ఎ నాయకర్

నరసాపురం: ప్రభుత్వ అధికారులు వారి పనిపట్ల చిత్త శుద్ధితో పనిచేయాలని, తద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. శనివారం కెపి పాలెం నార్త్, గ్రామ పంచాయతీకి సంబంధించి, వివిధ శాఖల అధికారులతో ఎంఎల్ఎ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తాగునీరు, రెవెన్యూ, విద్యుత్, సానిటేషన్ మొదలగు ప్రజా సమస్యలపై ఎంఎల్ఎ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నాయకర్ మాట్లాడుతూ పంచాయతీలలో ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని, ప్రభుత్వ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎక్కడ ఏ సమస్య వచ్చినా, దానిని వెంటనే పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా తాగునీరు విషయంలో జాగ్రత్త వహించాలని ఆర్‌డబ్ల్యు అధికారులకు సూచించారు. వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా జరగకుండా విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

సంచుల రగడ..!

రబీ ధాన్యం కొనుగోలులో సంచుల కొరతతో రైతులే సొంతంగా ఏర్పాటు
గోనెసంచులు రైతులకు తిరిగివ్వని పౌరసరఫరాల శాఖ
రెండు జిల్లాల్లో 387 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు
ప్రతి కేంద్రంలో 3 వేలకుపైగా సంచులు పెండింగ్
ఆర్‌బికెల చుట్టూ అన్నదాతల ప్రదక్షిణలు
సంచికి రూ.20 వరకూ నష్టపోతున్న రైతులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రబీ ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యి నెలలు గడుస్తున్నా రైతులకు ఇవ్వాల్సిన సంచులు ఇవ్వకుండా పౌరసరఫరాల శాఖ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుండటంపై అన్నదాతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండు జిల్లాల్లో ఏర్పాటు చేసిన అన్ని కొనుగోలు కేంద్రాల్లోనూ సంచుల సమస్య నెలకొంది. రబీ సీజన్‌లో రెండు జిల్లాలవ్యాప్తంగా దాదాపు మూడు లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. పశ్చిమగోదావరి జిల్లాలో 7.20 లక్షల టన్నులు, ఏలూరు జిల్లాలో 2.40 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. అందుకు తగినట్లుగా పశ్చిమలో 269 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 6.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం, ఏలూరు జిల్లాలో 120 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రెండు లక్షల 1610 టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ధాన్యం కొనుగోలు సమయంలో గోనె సంచుల కొరత లేదంటూ అధికారులు తెగ ఊదరగొట్టారు. తీరా ధాన్యం విక్రయించేందుకు రైతులు ఆర్‌బికెలకు వచ్చేసరికి సంచులు సకాలంలో అందించలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో రైతులు సొంతంగా సంచులు ఏర్పాటు చేసుకుంటే తర్వాత తాము తిరిగిస్తామంటూ పౌరసరఫరాల శాఖాధికారులు తెలిపారు. దీంతో చాలామంది రైతులు సొంతంగా గోనె సంచులు



ఏర్పాటు చేసుకుని ధాన్యం విక్రయించిన పరిస్థితి కొనసాగింది. అందుకు సంబంధించి ఆర్‌బికెల్లో తాము సొంతంగా సంచులు ఏర్పాటు చేసుకున్న ట్లు రైతులు నమోదు చేసుకున్నారు. ఆర్‌బికెల్లో ధాన్యం అమ్మిన రైతులకు సంబంధించి నమోదు చేసే ఆన్‌లైన్‌లో సంచుల కాలమ్ వద్ద మిల్లర్ల నుంచి సంచులు వస్తే మిల్లరు అని, రైతులు ఏర్పాటు చేసుకుంటే రైతు అంటూ ఆర్‌బికెల్లో నమోదు చేశారు. ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత రెండు, మూడు రోజుల్లో రైతులకు తిరిగి సంచులు ఇవ్వాల్సి ఉంది. రైతులు ధాన్యం విక్రయించి నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకూ రైతులకు గోనె సంచులు అందించలేదు. దీంతో రైతులు ఆర్‌బికె, సహకార సంఘాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. పౌర సరఫరాల శాఖ చినిగిపోయి, ఎందుకూ పనికిరాని సంచులు పంపి తీసుకోవాలని చెప్పడంపై రైతులు మండిపడుతున్నారు. చాలామంది మంది రైతులు ధాన్యం వ్యాపారుల వద్ద సంచులు తీసుకొచ్చి విక్రయించారు. ఇప్పుడు అధికారులు సంచులు ఇవ్వకపోవడంతో ఒక్కో సంచికి రూ.20 చొప్పున రైతుల నుంచి వసూలు చేస్తున్నారు. దీంతో వంద సంచులు తెస్తే రూ.రెండు వేలు, 200 సంచులు తెస్తే రూ.నాలుగు వేలు ఇంకా ఎక్కువ తెస్తే పెద్దఎత్తున డబ్బు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతుండటంతో లబోదిబోమంటున్నారు. నాణ్యమైన సంచులు ఇవ్వకుండా పౌరసరఫరాల శాఖ తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శి స్తుందని రైతులు మండి పడుతున్నారు. ప్రతి కొనుగోలు కేంద్రం లోనూ మూడు వేలకుపైగా సంచులు రైతులకు ఇవ్వాల్సి ఉందని తెలుస్తోంది. కొన్ని కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎనిమిది వేలకు పైగా సంచులు ఇవ్వాల్సి ఉండటం గమనార్హం. సంచుల కోసం రైతులు ఆర్‌బికె, సహకార సంఘాల అధికారులతో వాగ్వివాదాలకు దిగుతున్న పరిస్థితి ఉంది. దీంతో కిందిస్థాయి అధికారులకు ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. రైతులకు ఇవ్వాల్సిన సం చులు వెంటనే పౌరసర ఫరాలశాఖ ఇవ్వాలని అంతా కోరుతున్నారు. సంచుల సమస్యపై జిల్లా కలెక్టర్లు దృష్టి సారిస్తే తప్ప పరిష్కారమయ్యేలా కన్పించడం లేదు.

ప్రత్యేక హోదాపై నోరు మెదపరేమీ

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని అడిగే అవకాశమున్నా ఎందుకు జంకుతున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్యమంత్రి చంద్రబాబును సూటిగా ప్రశ్నించారు. శనివారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో సిపిఎం జిల్లా విస్తృత సమావేశం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన బిజెపి ప్రభుత్వానికి ఈ ఎన్నికల్లో ప్రజలు గట్టి బుద్ధి చెప్పారన్నారు. మిత్రుల సహకారంతో మాత్రమే మోడీ అధికారంలోకి వచ్చారని గుర్తించాలన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీల సహకారంతోనే మోడీ పాలన సాగుతుందని తెలిపారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఇంకెప్పుడు అడుగుతారని ప్రశ్నిం చారు. గత ముఖ్యమంత్రిలా లొంగుబాటు తత్వంతో కాకుండా, పోరాటతత్వంతో రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా మాత్రమే కాకుండా అభివీద్ధికి కీలకమైన ప్రత్యేక హోదాపైనా అడగాలన్నారు. రాష్ట్రానికి ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి ఉన్నారని, అయినా విశాఖ ఉక్కును ప్రయివేటుపరం కానీయబోమని అటు



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

బిజెపి, ఇటు తెలుగుదేశం కూటమి ప్రభుత్వం చెప్పడానికి సిద్ధపడటం లేదని ఎద్దేవా చేశారు. పోలవరం డ్యామ్‌తోపాటు ముంపు ప్రాంతాల ప్రజలకు పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ రాష్ట్రంలో రోజురోజుకీ నిత్యావసర ధరలు తగ్గుతున్నా అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ జిల్లాలో తక్షణం దెబ్బతిన్న రోడ్లు నిర్మించాలన్నారు. రైతులకు ధాన్యం బకాయిలు తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి దళితపేటకూ రెండెకరాల భూమిని శ్మశాన వాటికకు కేటాయించాలన్నారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు, బి.వాసుదేవరావు, డి.కల్యాణి, కర్రి నాగేశ్వరరావు, పివి.ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

'ఉచిత ఇసుక' అమలుకు చర్యలు చేపట్టాలి

కలెక్టర్ సి.నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

జిల్లాలో ఉచిత ఇసుక పాలసీ అమలుకు ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సి.నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్ శాఖల అధికారులతో నూతన ఇసుక పాలసీ అమలుకు చేపట్టాల్సిన చర్యలపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు ఉచితంగా ఇసుకను అందించేందుకు నూతన విధానం తీసుకొచ్చిందన్నారు. ఆ విధివిధానాలను సంబంధిత అధికారులు పూర్తిగా అవగాహన చేసుకుని అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఆరు ఓపెన్ రీచ్‌లు ఆచంట మండలంలో కరుగోరుమిల్లి, కోడేరు, పెనుగొండ మండలంలో సిద్ధాంతం-1, 2,



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సి.నాగరాణి

నడిపూడి-1, 2 ఉన్నాయన్నారు. డీసిల్టేషన్ పాయింట్లు అబ్బిరాజుపాలెం, మాధవాయపాలెం, యలమంచిలిలంక, దొడ్డిపట్ల, చించినాడల్లో ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఏఒక్క పాయింట్‌లోనూ ఆపరేషన్ సాగడం లేదన్నారు. ఆరు ఇసుక స్టాక్ యార్డులు భీమవరం, ఉండి, తాడేపల్లిగూడెం, తణుకు, సిద్ధాంతం, కొడమంచిలిలో ఉన్నాయని తెలిపారు. ఇసుక తవ్వకాలకు అవసరమైన అనుమతులను పొందాల్సి ఉందని, దీనికి సంబంధించి గోదావరి హెడ్ వర్క్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ద్వారా అనుమతులకు ప్రతిపాదనలను సమర్పించాల్సి ఉందని తెలిపారు. అన్ని డీసిల్టేషన్ పాయింట్లకు గోదావరి హెడ్‌వర్క్స్ ఇఇ కాశీవిశ్వేశ్వరరావును కస్టోడియన్ అధికారిగా నియమించినట్లు తెలిపారు. గుర్తింపు పొందిన బోట్స్‌మెన్ సొసైటీల జాబితా సిద్ధంగా ఉంచాలన్నారు. థర్డ్ ఆర్డర్ స్ట్రీమ్‌లకు పంచాయతీ కార్యదర్శులను కస్టోడియన్లుగా నియమించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. మరికొన్ని డీసిల్టేషన్ పాయింట్లను గుర్తించేందుకు చర్యలు తీసుకోవాలని నరసాపురం ఆర్‌డిఒకు సూచించారు. ఆరు స్టాక్ పాయింట్లకు కస్టోడియన్ అధికారులుగా పోలీస్, రెవెన్యూ అధికారులను నియమించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి అజిత వేజెండ్ల, జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్‌ఆదిత్య, సెబ్ అడిషనల్ ఎస్‌పి ఎటివి.రవికుమార్, జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారి ప్రసాద్, రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల వద్ద వీధి లైట్లు ప్రారంభం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో టిడ్కో ఇళ్ల సముదాయంలో కొత్తగా ఏర్పాటు చేసిన వీధిలైట్లను మంత్రి నిమ్మల రామానాయుడు శనివారం ప్రారంభించారు. మెయిన్ రోడ్ నుంచి కాలనీ ప్రాంగణం వరకు కొత్తగా విద్యుత్ స్తంభాలు, లైట్లను ఏర్పాటు చేశారు. దీంతో రాత్రి సమయంలో ఈ ప్రాంత వాసుల ఇబ్బందులు తీరనున్నాయి. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ జగన్ టిడ్కో ఇళ్లను తాకట్టు పెట్టి రూ.180 కోట్లు కొట్టేశారన్నారు. కనీసం వీధి దీపాలను కూడా ఏర్పాటు చేయలేదన్నారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్ల నిర్మాణం 90 శాతం పూర్తి చేస్తే జగన్ ఐదేళ్ల పాలనలో అర బస్తా



టిడ్కో గృహాల వద్ద వీధిలైట్లు ప్రారంభిస్తున్న మంత్రి నిమ్మల

సిమెంట్, రూపాయి పనికి నోచుకోలేదని మంత్రి నిమ్మల విమర్శించారు. టిడిపి హయాంలో నియోజకవర్గంలో 33/11 కెవి సబ్‌స్టేషన్లు ఐదు నిర్మిస్తే గత ఐదేళ్లలో ఒక సబ్ స్టేషన్ కూడా ఏర్పాటు చేయలేదన్నారు.

12.4 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదు

ప్రజాశక్తి - నరసాపురం

జిల్లాలో గడిచిన 24 గంటల్లో నమోదైన వర్షపాతం వివరాలను శనివారం అధికారులు వెల్లడించారు. అత్యధికంగా నరసాపురంలో 47.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. గణపవరం, తణుకు, అత్తిలి ప్రాంతంలో అసలు వర్షపాతం నమోదు కాలేదు. మొగల్తూరు 33.2, పాలకొల్లు 32.4, యలమంచిలి 22.4, పోడూరు 20.6, పాలకోడేరు 18.4, ఆచంట 16, పెనుగొండ 12, వీరవాసరం 9, ఆకివీడు 8, భీమవరం 6.4, తాడేపల్లిగూడెం 6.2, పెంటపాడులో 4.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లావ్యాప్తంగా 12.4 మిల్లీమీటర్లు సగటు వర్షపాతం నమోదైంది.

నిత్యావసరాల ధరలు నియంత్రణకు చర్యలు

జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్‌ఆదిత్య

ప్రజాశక్తి - భీమవరం టౌన్

బహిరంగ మార్కెట్లో నిత్యావసరాల ధరల నియంత్రణకు చర్యలు చేపట్టామని, దీనికి వర్తకులు తమవంతు సహకారం అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్ ఆదిత్య కోరారు. శనివారం స్థానిక కలెక్టర్ కార్యాలయం వశిష్ట కాన్ఫరెన్స్ హాలులో ఆయన రిటైల్ అమ్మకందారులతో సమావేశమై మార్కెట్లో నిత్యావసర వస్తువుల ధరల స్థిరీకరణపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆదిత్య మాట్లాడుతూ ప్రస్తుతం ఉల్లిపాయలు, కూరగాయలతోపాటు పప్పులు, బియ్యం, ఆయిల్ వంటి నిత్యావసరాల ధరలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయన్నారు. నిత్యావసరాల ధరా భారం తగ్గించేందుకు వర్తకులు సహకరించాలని కోరారు. బియ్యం, పప్పులు, ఆయిల్, కూరగాయలు, ఉల్లి, టమాటా తదితరాల ధరల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలు పలు సూచనలు చేశారు. వర్తకులు తమ వద్ద ఉన్న స్టాక్ వివరాలు వెంటనే భారత ప్రభుత్వ వెబ్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఇతర ప్రాంతాలలో ఎక్కువగా పండించే కూరగాయలను నేరుగా కొనుగోలు చేసి రైతుబజార్ల విక్రయించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ డైరెక్టర్ మార్కెటింగ్ సునీల్, సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ టి.శివరాంప్రసాద్, ఎఎస్‌ఒ ఎం.రవిశంకర్, వర్తక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్‌ఆదిత్య

న్యాయం జరిగే వరకూ పోరు

కొనసాగిన సిపిఎఫ్ కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి - గణపవరం

మూసివేసిన సిపిఎఫ్ ఫ్యాక్టరీని తెరిపించి తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఆ ఫ్యాక్టరీ ఉద్యోగ, కార్మికులు సరిపల్లిలోని ఫ్యాక్టరీ వద్ద చేపట్టిన ఆందోళన శనివారం 29వ రోజు కూడా కొనసాగింది. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగ, కార్మిక నేతలు మాట్లాడుతూ సుమారు నెల రోజులుగా ఆందోళన చేస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టనట్లు వ్యవహరించడం సరికాదన్నారు. జిల్లా లేబర్ అధికారుల వద్ద చర్చలు జరిగినప్పటికీ ఫ్యాక్టరీ యాజమాన్యం మొండి వైఖరి ప్రదర్శించడం దారుణమన్నారు. తమకు న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. యాజమాన్యం స్పందించకపోతే నిరవధిక నిరాహారదీక్ష చేపడతామని హెచ్చరించారు. కార్యక్ర మంలో ఉద్యోగ, కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



సిపిఎఫ్ ఫ్యాక్టరీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగ కార్మికులు

పశుసంక్రమిత వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్‌లో కలెక్టర్ సి.నాగరాణి

భీమవరం టౌన్: పశుసంక్రమిత వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలని, తప్పక వ్యాక్సినేషన్ చేయించాలని జిల్లా కలెక్టర్ సి.నాగరాణి తెలిపారు. శనివారం ప్రపంచ పశు సంక్రమిక వ్యాధుల నివారణా దినం(ప్రపంచ జునోసిస్ దినోత్సవం) సందర్భంగా భీమవరం పశువుల ఆసుపత్రిలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సి.నాగరాణి, భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ సి.నాగరాణి మాట్లాడుతూ ప్రతి ఏటా ఈనెల 6న ప్రపంచ జునోసిస్ దినోత్సవంగా పాటిస్తున్నామన్నారు. 1885 జులై 6న లూయీ పాశ్చర్ అనే శాస్త్రవేత మొదటిసారిగా పిచ్చి కుక్క కాటుకు గురైన 9 ఏళ్ల బాబుకి రేబిస్ వ్యాధి రాకుండా కనుగొన్న వ్యాధినిరోధక టీకాలను విజయవంతముగా అందించడం జరిగిందన్నారు. దీనికి చిహ్నంగా



వ్యాక్సినేషన్ కార్యక్రమంలో కలెక్టర్, ఎంఎల్ఎ

జులై 6 పశు సంక్రమిక వ్యాధుల నివారణ దినం(జునోసిస్ డే)గా పాటిస్తున్నామన్నారు. మన చుట్టూ మనతో పాటు మసలే పశు పక్ష్యాదులు, జంతువుల వల్ల మేలుతో పాటు ప్రమాదం కూడా పొంచి ఉందన్నారు. మన ఇంట్లో మనతో పాటు ఉండే కుక్క పిల్ల, మనకు తెలియకుండా తిరిగే ఎలుక, మన రక్తాన్ని సైలెంట్‌గా పిల్చే దోమ, పాలు ఇచ్చే గేదెలు, పౌష్టికాహారం అందించే కోడి వల్ల ప్రమాదం రావచ్చు అన్నారు. ఇటువంటి పలురకాల పశువులు, జంతువులు, కీటకాల వల్ల సుమారు 150కిపైగా వ్యాధులు వస్తాయన్నారు. ఇందులో ప్రాణాపాయం కలిగించే వ్యాధులు ఉన్నాయని, ఆ వ్యాధులు ఎమిటో ఎలా సంక్రమిస్తాయో, అవి రాకుండా మనం ఏమి చేయాలో ప్రతి ఒక్కరూ అవగాహన పొందాలని తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యుహెచ్) లెక్కల ప్రకారం ఈ వ్యాధుల వల్ల సుమారు 60 వేల మంది సంవత్సరానికి మన దేశంలో మరణినిస్తునారన్నారు. ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ యజమానులు పెంపుడు జంతువులను బయటకు వదలకుండా ఇంటి వద్ద జాగ్రత్తగా ఉండేలా చూసుకోవాలన్నారు. పెంపకంతో పాటు అప్రమత్తత ఎంతో అవసరమని తెలిపారు. అభిమానంతో పెంచుకునే కుక్కల నుంచి రేబిస్, గజ్జి వంటి వ్యాధులు రాకుండా వ్యాక్సిన్‌ను వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమం చివరిగా జిల్లా జంతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎంఎల్ఎ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, మెమొంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ, డిఎంహెచ్‌ఒ డాక్టర్ డి.మహేశ్వరరావు, భీమవరం మున్సిపల్ కమిషనర్ శ్యామల, జిల్లా జంతు సంక్షేమ సంఘం అధ్యక్షులు సుంకర దాసు, సభ్యులు చెరుకువాడ రంగసాయి, నరహరిశెట్టి కృష్ణ, పశుసంవర్ధక శాఖ వైద్యులు, సిబ్బంది, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

చేతివృత్తుల వారిని ఆదుకోవాలి


ప్రజాశక్తి - పెనుమంట్ర

చేతివృత్తుల మీద ఆధారపడి జీవిస్తున్న వారిని ప్రభుత్వం ఆదుకోవాలని జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు అల్లాడ సూర్య భాస్కర్ రావు కోరారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో తిరిగి చేతివృత్తులు చేసుకొనే వారిని కలుసుకొని, వాళ్ల సమస్యలు అడిగి తెలుసుకున్నామని తెలిపారు. ప్రభుత్వ పరంగా వారికి అందవలసిన రాయితీలు వచ్చేలా కృషి చేస్తామని తెలిపారు. జిల్లాలో అధికంగా చేనేత కులస్తులు ఉన్నారని, ప్రభుత్వం గుర్తించి చేనేత కార్మికులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, అన్ని చేనేత సొసైటీలకు ఎలక్షన్ జరిపించాలని, చేనేత కార్మికులకు ఉపాధి హామీ చట్టంలో చేర్చాలని డిమాండ్ చేశారు.

వశిష్ట బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

కేంద్రమంత్రికి మాజీ ఎంఎల్ఎ మాధవ నాయుడు వినతి

నరసాపురం: నరసాపురం-సఖినేటిపల్లి మీదుగా గోదావరిపై నిర్మించనున్న బ్రిడ్జి నరసాపురం పట్టణం మీదుగా నిర్మాణం చేపట్టి నరసాపురం అభివృద్ధికి కృషి చేయాలని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మని ఢిల్లీ కార్యాలయంలో నరసాపురం మాజీ ఎంఎల్ఎ బండారు మాధవ నాయుడు కలిసి వినతిపత్రం అందజేశారు. నరసాపురం-సఖినేటిపల్లి ఉభయగోదావరి జిల్లాలను కలుపుతూ వశిష్ట గోదావరి నదిపై నిర్మించనున్న బ్రిడ్జి నరసాపురం పట్టణం మీదుగా నిర్మాణం చేపట్టాలన్నారు. 2014లో టిడిపి హయాంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టిలో పెట్టి, రాష్ట్రంలో వున్న 9 మంది ఎంపీలను కలిసి అప్పటి కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి వివరించగా తక్షణమే స్పందించి బ్రిడ్జి నిర్మాణానికి ఇన్ ప్రిన్సిపల్, డిపిఆర్ అప్రూవల్ ఇవ్వటమైనదని మంత్రికి మాధవ నాయుడు వివరించారు. అనంతరం బ్రిడ్జి నిర్మాణానికి టెండర్ ప్రక్రియ మొదలు పెట్టే సమయంలో ఎన్నికలు రావటంతో పక్రియ నిలిచిందని



వినతినందిస్తున్న బండారు

తెలిపారు. అనంతరం వచ్చిన వైసిపి ప్రభుత్వం వారి స్వలాభం కోసం ముందుగా మంజూరు చేసి, ప్లాన్‌ని మార్చి రాజుల్లంక మీదుగా బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు పూనుకున్నారన్నారు. రాజుల్లంకలో బ్రిడ్జి నిర్మాణం వల్ల ఇరు ప్రాంతాల ప్రయాణికులకు సుమారు 15 కిమీపైగా ఎక్కువ ప్రయాసతో కూడుకున్న ప్రయాణమని అన్నారు. పట్టణం మీదుగా బ్రిడ్జి నిర్మాణం చేపట్టడం వల్ల పంటు సమస్య శాశ్వత పరిష్కారం దొరుకుతుందని మాధవ నాయుడు కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మకు వివరించారు. కొత్త ప్రతిపాదన వల్ల ప్రభుత్వానికి గతంలో ప్రతిపాదించిన ప్లాన్ కన్నా అధిక ఆర్థిక భారం ప్రభుత్వంపై పడుతుందని తెలిపారు. దీనిపై కేంద్ర సహాయ మంత్రి పరిశీలించి ప్రాంత ప్రజలకు మేలు జరిగేలా చూడాలని మాధవ నాయుడు కోరారు. దీనిపై స్పందించిన కేంద్ర సహాయ మంత్రి నితిన్ గడ్కరీ దృష్టిలో పెట్టి, సంబంధిత అధికారులతో సంప్రదించి బ్రిడ్జి నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారని తెలిపారు.

పదవుల కోసం ఫీట్లు.. పట్టని జనం కష్టాలు..!

ఎన్నికల ఫలితాలు వచ్చి నెల రోజులు దాటింది. ప్రజాప్రతినిధులు జనం సమస్యల అధ్యయనంలో బిజీబిజీగా పర్యటనలు సాగిస్తున్నారు. ఇక అధికారులు బదిలీల కోసం ఎదురుచూస్తూనే కొత్త ప్రజాప్రతినిధుల ఆలోచనల మేరకు పనులకు ప్రతిపాదనల తయారీలో నిమగ్నమయ్యారు. అదే సమయంలో గ్రామ, మండల, నియోజకవర్గస్థాయి టిడిపి, జనసేన, బిజెపి నేతలు మాత్రం నామినేటెడ్ పదవుల కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇదే సమయంలో ఎంఎల్‌ఎలుగా ఎన్నికైన వారు సైతం తమ హోదా మరింత పెంచుకునే ప్రయత్నాల్లో ఉన్నట్లు సమాచారం. నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్‌కు విప్ హోదా కల్పించాలని సిఎం చంద్రబాబుకు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ లేఖ రాసిన సంగతి తెలిసిందే. దీంతో నాయకర్‌కు విప్ పదవి కట్టబెడుతూ అధికారిక ప్రకటన రావడమే తరువాయి. ఉండి ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజుకు కూడా ఏదోక పదవి కట్టబెట్టి సముచిత స్థానం కల్పిస్తారనే ప్రచారం సాగుతోంది. ఆచంట ఎంఎల్ఎ, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ, తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ సీనియర్లు కావడంతో చంద్రబాబు కచ్చితంగా కొంత ప్రాధాన్యత దక్కే రీతిలో చర్యలు చేపడతారనే ప్రచారం సాగుతోంది. ఇదిలా ఉండగా రాష్ట్ర, జిల్లాస్థాయి నామినేటెడ్ పదవుల కోసం నియోజకవర్గ, మండలస్థాయి నేతలు పైరవీలు ప్రారంభించారు. జనసేన ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో టిక్కెట్ ఆశించి భంగపడ్డ టిడిపి నేతలు ప్రస్తుతం రాష్ట్ర లేదా జిల్లాస్థాయి నామినేటెడ్ పదవుల కోసం జిల్లా మంత్రులతోపాటు లోకేష్‌ను ప్రత్యేకంగా కలుస్తున్నారు. అదే సమయంలో జనసేన



తరపున టిక్కెట్ ఆశించి భంగపడిన సీనియర్ నేతలు సైతం నామినేటెడ్ పదవుల కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఆయా నియోజకవర్గాల్లో టిడిపి ఎంఎల్‌ఎలతో వైరం లేకుండా చూసుకుంటూనే తమ అధినేతను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ఇక బిజెపి నేతలు కొందరు మాత్రం దేవాలయ కమిటీల్లో అత్యధికం తమకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరుతున్నట్లు ప్రచారం సాగుతోంది. మొత్తంగా నియోజకవర్గ, మండల స్థాయి నేతలు నామినేటెడ్ పదవుల కోసం చేస్తున్న ప్రయత్నాలు కూటమిలోని పార్టీల మధ్య కొన్నిచోట్ల ఆధిపత్య పోరుకు కారణమవుతుందనే చర్చ సాగుతోంది. ఇదిలా ఉండగా గ్రామస్థాయిలో నేతలు మాత్రం పదవులు రాకుండానే అధికారపక్షం మేమేనంటూ స్థానికంగా ఉండే అంగన్వాడీలు, పాఠశాలలు, సచివాలయాలుపై ఆధిపత్యానికి గట్టిప్రయత్నం చేస్తున్నారు. ప్రధానంగా స్కీమ్‌వర్కర్లు తాము చెప్పింది చేయాలంటూ ఒత్తిడి తీసుకొస్తూ లేనిపక్షంలో తమ వారిని నియమించుకుంటామని బహిరంగంగా చేస్తున్న వ్యాఖ్యలు గత వైసిపి ప్రభుత్వ నేతల తీరును తలపిస్తున్నాయనే విమర్శలు విన్పిస్తున్నాయి. అదే కొనసాగితే వైసిపి ప్రభుత్వ దుస్థితే రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వానికి తప్పదని పరిశీలకులు హెచ్చరిస్తున్నారు. ఏదేమైనా నామినేటెడ్ పదవుల కోసం నేతల ఫీట్లు ఎలాగున్నా జనం ప్రధానంగా ఎదుర్కొంటున్న ధరలు, ఉపాధి, రోడ్లు, తాగునీరు, పారిశుధ్యం వంటి సమస్యలపై దృష్టి సారించి పరిష్కారానికి కృషి చేయాలని అంతా కోరుతున్నారు.

-విఎస్ఎస్వి.ప్రసాద్

బాబూజగ్జీవన్ రావు చిరస్మరణీయుడు

ప్రజాశక్తి - ఆచంట

స్వతంత్ర సమరయోధుడు, కేంద్రమంత్రి, దేశ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రావ్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి అన్నారు. డాక్టర్ బాబు జగ్జీవన్ రావ్ 38వ వర్ధంతి శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి ఎంపిపి సూర్యకుమారి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కందరవల్లి సర్పంచి బోడపాటి బుల్లియ్య, టిడిపి నాయకులు మానేపల్లి సత్యనారాయణ, ఇఒపిఆర్డి మూర్తి బాబు, పంచాయతీరాజ్ ఎఇ రమేష్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలని, బాబు జగ్జీవన్‌రామ్ ఆశయాలను సాధించాలని తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం పట్టణం యాగర్లపల్లి ఫ్లై ఓవర్ దిగువన నూతనంగా ఏర్పాటు చేసిన బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షులు వర్తనపల్లి కాశీ, జనసేన సీనియర్ నాయకులు వైద్యుల వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలి

మానవత మండల అధ్యక్షులు లీలాప్రసాద్

ఆచంట: ప్రతిఒక్కరూ సేవాభావం కలిగి ఉండి సమాజసేవా కార్యక్రమాల్లో తమ వంతు సహాయ సహకారాలు అందించాలని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల అధ్యక్షులు కుక్కల లీలా ప్రసాద్ అన్నారు. ఆచంట మండల మానవత సేవాసంస్థ ఆధ్వర్యంలో సామాజిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో శనివారం బాలింతలకు బేబీ కిట్స్, పండ్లు, ఔషధాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లీలా ప్రసాద్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాలకు సైతం సేవా కార్యక్రమాలు విస్తృతం చేసేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవత జిల్లా ఆడిట్ కమిటీ మెంబర్ నెక్కంటి శివన్నారాయణ, చైర్మన్ నంబూరి అంజిబాబు, కో చైర్మన్ వేంద్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాధితుడికి అండగా వైసిపి

వీరవాసరం: ఇటీవల అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు రోజున జనసేన విజయోత్సవ ర్యాలీ సందర్భంగా వీరవాసరం పెదపేట వద్ద దాడికి గురైన దళిత సామాజిక వర్గానికి చెందిన యువకుడు లింగంపల్లి సాల్మన్‌రాజుకు వైసిపి అండగా నిలిచింది. నాడు గాయాలతో ఉసుపత్రిలో చికిత్స పొందిన సాల్మన్‌రాజును ఆర్థికంగా ఆదుకునేందుకు వైసిపి రాష్ట్ర కమిటీ రూ.50 వేల చెక్కును బాధితుడికి పంపారు. ఈమేరకు ఆ చెక్కును మండల నాయకులు శనివారం బాధితుడి ఇంటి వద్ద అందజేశారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చాం కదా అని ఇష్టానుసారంగా దాడులు చేసే సంప్రదాయం సరైన చర్యకాదన్నారు. ఒక దళితుడిపై దాడి జరిగితే దానిని వైసిపి నాయకులు ఖండించకపోవడం చూస్తే విధానం కారణంగా కూటమి ప్రభుత్వం తాడి రాజకీయాలకు వైసిపి నాయకుల తీరును తప్పుపట్టడంతో అదే పార్టీకి చెందిన పరువు వెంకటేశ్వరావు రాజకీయ వాఖ్యానాల పట్ల అభ్యంతరం వ్యక్తం చేయడంతో వారిద్దరి మధ్య కొద్దిసేపు వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి చైర్మన్, జెడ్‌పిటిసీలు కోటిపల్లి బాబు, మానుకొండ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సే లక్ష్యంగా..

ఉండి: రైతుల శ్రేయస్సే లక్ష్యంగా ఉండి ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు పనిచేస్తారని ఉండి టిడిపి ఉండి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు అన్నారు. శనివారం ఉండి గ్రామ అధ్యక్షుడు కాగిత వెంకట సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కరిమెరక నాగరాజు మాట్లాడుతూ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఉండి గ్రామం నుంచి కనుమూరి రఘురామకృష్ణంరాజుకి 2702 ఓట్లు మెజారిటీని అందించి ఆయన విజయంలో క్రియాశీలక పాత్ర పోషించిన టిడిపి నాయకులకు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. ఉండి ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు రైతు శ్రేయస్సే లక్ష్యంగా పనిచేస్తున్నారని అన్నారు. గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఆయన కృషి చేస్తున్నారన్నారు. ఆయనకు సహకారం అందిస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి బండారు సుబ్బారావు, యూనిట్ ఇన్‌చార్జులు గురుగుబిల్లి వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

పిహెచ్‌సి ఆకస్మిక తనిఖీ

ఉండి: యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఉమామహేశ్వరరావు శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పిహెచ్‌సిలో రికార్డులను, మందుల సరఫరాను, డెలివరీ కేసులను, పిహెచ్‌సికి వచ్చే రోగుల సంఖ్యను పరిశీలించడం జరిగిందని సిబ్బంది పనితీరుపై సంతృప్తిని వ్యక్తం చేశారు. ఆసుపత్రికి సంబంధించి పాల్గొన్నారు. ల్యాబ్ టెక్నీషియన్, నైట్ వాచ్మెన్, కంటిగ్జెంట్ వర్కర్ తదితర పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీ చేయాల్సిందిగా ఆసుపత్రి వైద్యుల తన దృష్టికి తీసుకు వచ్చినట్లు ఆయన తెలిపారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో నిర్వహించిన జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమంలో పాల్గొని ఆరు సంవత్సరాల లోపు పిల్లలకు అతిసార వ్యాధి నివారణకు ఓఆర్ఎస్ ద్రావణం జింక్ మాత్రలను తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. ప్రతి గ్రామంలోనూ అతిసారంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ బిన్నీ శామ్యూల్, డాక్టర్ ఎం కీర్తన, వైద్య విస్తరణ అధికారి యం.రత్నరాజు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించాలి : కలెక్టర్

భీమవరం టౌన్: విద్యార్థులు ఉన్నతంగా విద్యను అభ్యసించేందుకు అనువైన వాతావరణాన్ని వసతి గృహాల్లో కల్పించాలని జిల్లా కలెక్టర్ సి.నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం భీమవరం పట్టణంలోని ఏరియాలో బిసి ప్రీ మెట్రిక్, ఎస్‌సి ప్రీమెట్రిక్, ఎస్‌సి గర్ల్స్ కాలేజ్ హాస్టల్ క్యాంపస్, శివరావు పేటలో ఎస్‌సి కాలేజ్ బాయ్స్ హాస్టల్‌ను శనివారం జిల్లా కలెక్టర్ సి.నాగరాణి ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వసతి గృహాల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, భోజన వసతిపై ఆరా తీశారు. జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి జివిఆర్‌కెఎస్ఎస్ గణపతి రావు, జిల్లా అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారి సిహెచ్.భానుమతి, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి డి.పుష్పరాణి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మొగల్తూరు : రహదారి ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం భీమవరం గ్రామీణ మండలం దొంగ పిండి గ్రామానికి చెందిన రేవు యేసు(20), దెయ్యాల తిప్ప గ్రామానికి చెందిన తిరుమని గణేష్(14)లు నరసాపురం వచ్చి తిరిగి వెళుతుండగా మొగల్తూరు మండలం కొత్తప వంతెన సమీపంలో జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీ కొంది. దీంతో యేసు సంఘటన ప్రాంతంలోనే మృతి చెందాడు. గణేష్‌ను 108 అత్యవసర వాహనం సిబ్బంది పైబెట్ బి.రత్నసాగర్, ఇఎంటి రాజేష్ సంఘటన ప్రాంతానికి చేరుకుని గణేష్‌కు ప్రథమ చికిత్స అందించారు. యేసుని పరిస్థితి మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం గణేష్‌ను నరసాపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఉండి: మండలంలోని వాండ్రం గ్రామానికి చెందిన కనపాల సింహాద్రి(42) జూన్ 27వ తేదీన వాండ్రం రహదారిలో చెట్టు కొమ్మలు నరుకుతుండగా ఒక చెట్టుకొమ్మ సింహాద్రి మెడ మీద పడడంతో సింహాద్రి అపస్మారకస్థితిలోకి స్పృహ కోల్పోయాడు. స్థానికులు అతడిని భీమవరంలోని ప్రయివేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడి నుంచి పరిస్థితి విషమించడంతో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి చనిపోవడంతో భార్య జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉండి ఎఎస్ఐ సుబ్బారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బంగారు ఆభరణాలతో పరారైన యువతి అరెస్ట్

పాలకొల్లు : పాలకొల్లులోని బంగారు షాపులో పట్టపగలు ఒక మహిళ 10 గ్రాముల బంగారు వస్తువులతో పారిపోతుండగా సిబ్బంది పట్టుకుని పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుర్తుతెలియని 22 సంవత్సరాల యువతి బంగారు వస్తువులు కొనేందుకు స్థానిక శ్రీ జ్యుయలర్స్‌కు ఉదయం 11.15కు వచ్చింది. సుమారు 10 గ్రాముల బంగారు వస్తువులను కొనుగోలు చేసి, తమ తల్లి బ్యాంకులో ఉందని, అక్కడ రస్సీగా ఉందని, డబ్బుతో వస్తానని నమ్మించింది. వచ్చాక సుమారు 3 గంటల వరకు వేచి సిబ్బంది ఆగ్రహంగా ఉండగా బంగారు వస్తువులతో పారిపోతుండగా సిబ్బంది పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఆమెది మంగళగిరిగా చెబుతోంది. ఆమె తల్లిని పోలీసులు పిలిపించగా పోదూరు మండలం పెనుమదం చెబుతోంది. ఆమె ఒంటరిగా వచ్చిందా లేక మరెవరైనా ఉన్నారా అనే కోణంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పలుచోట్ల 'జునోసిస్ డే'



ఉండిలో అవగాహన కల్పిస్తున్న వైద్యులు

నరసాపురం: మండలంలోని కొప్పర్రులోని పశు వైద్యశాలలో శనివారం జునోసిస్ డే నిర్వహించారు. కొప్పరు వైద్యాధికారి ఇంజేటి సురేంద్ర, సిబ్బందితో కలిసి పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. డాక్టర్ సురేంద్ర మాట్లాడుతూ వ్యాధులు రాకుండా పెంపుడు జంతువులకు సకాలంలో టీకాలు వేయించాలని తెలిపారు.

పెనుగొండ : పశువులు వ్యాధుల బారిన పడకుండా వేయవలసిన టీకాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని సర్పంచి నక్క శ్యామల సోనీ అన్నారు. శనివారం ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా స్థానిక ఎండిఒ ఆఫీస్ పశువుల వైద్యశాల వద్ద ప్రపంచ జునోసిస్ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సర్పంచి మాట్లాడుతూ కుక్కలు, పశువులు, ఇతర జంతువులు, కోళ్లు, పక్షుల నుంచి సంక్రమించే జునోటిక్ వ్యాధుల విషయంలో పశుపోషకులు, జంతుప్రేమికులు జాగ్రత్తగా ఉండాలన్నారు. పశువుల వైద్యాధికారి డాక్టర్ ఎం.రాణి మాట్లాడుతూ పశువులు, వాటి పాకల అపరిశుభ్రత, తదితర కారణాలతో వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తం చేయాల్సిన, వ్యాధులపై ప్రచారం కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. పశువైద్యశాలల్లో రేబిస్ నివారణ టీకాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పశు వైద్యలు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోదూరు: పెంపుడు జంతువులకు వ్యాపించే వ్యాధులు పట్ల యజమానులు అప్రమత్తంగా ఉండాలని పోడూరు మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎస్.మహేష్ కుమార్ పిలుపునిచ్చారు. ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా మండలంలోని పోడూరు, జున్నూరు, పెనుమదం, పండిత విల్లూరు పశువైద్యశాలల్లో శనివారం పెంపుడు కుక్కలకు ఉచితంగా రాబిస్ వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో వెటర్నరీ ఎడి డాక్టర్ పి.జయకర్ జాన్సన్, డాక్టర్ మాధురి పాల్గొన్నారు.

ఉండి: పెంపుడు జంతువుల పట్ల ప్రేమతో పాటు అప్రమత్తత ఎంతైనా అవసరమని ఉండి మండల పరిషత్ అధ్యక్షులు ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు అన్నారు. శనివారం ఉండి ప్రాంతీయ పశువైద్యశాల ఆవరణలో ఇన్‌ఛార్జి మండల పశు వైద్యాధికారి డాక్టర్ హేమ అధ్యక్షతన నిర్వహించిన జునోసిస్ డే కార్యక్రమంలో శ్రీహరి నారాయణరాజు, టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు పాల్గొన్నారు. పలు గ్రామాల నుంచి వచ్చిన పెంపుడు జంతువులకు రాబిస్ వ్యాక్సిన్ వేశారు.

పెనుమంట్ర : మండలంలోని మార్టేరు ప్రాంతీయ పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలకు ఉచిత యాంటీ రాబిస్ వ్యాధి నిరోధక టీకాలను పంపిణీ చేసినట్లు సహాయ సంచాలకులు డాక్టర్ వాకాణి ప్రసాద్ తెలిపారు. శనివారం జునోసిస్ వ్యాధులపై పెంపుడు జంతువుల యజమానులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు.


ఎండాకు తెగులు సోకకుండా జాగ్రత్తలు

మార్టేరు ఫారం ఎడిఆర్ డాక్టర్ టి.శ్రీనివాస్

ప్రజాశక్తి - పెనుమంట్ర

రాష్ట్రంలో అధిక విస్తీర్ణంలో పండిచే వరి పంటకు వివిధ రకాల తెగుళ్లు ఆశిస్తున్నాయి. ఈ మధ్యకాలంలో సార్వాకాలం వర్షపాతం ఎక్కువగా నమోదవుతున్న సమయంలో బాక్టీరియా ఎండాకు తెగులు సమస్యాత్మకంగా మారిందని మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం ఎడిఆర్ డాక్టర్ టి.శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ సమస్య నారుమడి చివరి దశలో, నాట్లు వేసిన 15-30 రోజుల మధ్యలో కూడా అక్కడక్కడా మొక్కలు పసుపు రంగుకు మారి చనిపోతున్నాయన్నారు. ఇది ఎండాకు తెగులు మొదటి దశ అయిన 'క్రెసెక్ దశ'. దీనిని సరైన సమయంలో గుర్తించి యాజమాన్య చర్యలు చేపట్టవలసిన అవసరం ఉంది. కావున 'క్రెసెక్ దశ' లక్షణాలు, యాజమాన్యం గురించి తెలుసుకొనుట ఆవశ్యకం అని తెలిపారు.

ఎండాకు క్రెసెక్ దశ : ఈ దశ ఎంటియు 1318, పిఎల్ఎ 1100, బిపిటి 5204 రకాలలో ఎక్కువగా కనిపిస్తుంది. ఈ దశ నారు మడి దశ నుంచి నాట్లు వేసిన నెల రోజుల వరకు వరి పంటను ఆశిస్తుంది. నారుమడిలో ఆకులు అంచుల నుంచి లోపలివైపుకు నీటి డాగు మచ్చల మాదిరిగా ఏర్పడి క్రమేపీ పసుపు రంగుకు మారతాయి.



తెగులు సోకిన వరిపైరు

తెగులు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు దుబ్బులో కొన్ని పిలకలు, లేదా దుబ్బు మొత్తం చనిపోవడం జరుగుతుంది. దీనిని 'క్రెసెక్' దశ అని పిలుస్తాము. చాలా మంది రైతులు ఈ లక్షణాలను 'కాండం కుళ్లు' లేక 'దుబ్బు కుళ్లు' తెగులు అని పొరపడి, శిలీంధ్రనాశినులు పిచికారీ చేయడం వల్ల తెగులు నివారణ సరిగా జరగకపోగా, అనవసరంగా తెగులు మందుల పిచికారీ వల్ల సాగుఖర్చు పెరిగిపోతుంది.

ఊజ్ పరీక్ష: తెగులు నిర్ధారణకు ఎండిన ఆకులను చిన్న చిన్న ముక్కలుగా కత్తిరించి మంచినీటితో ఉన్న గాజుగ్లాసులో వేయాలి. ఇలా చేయడం వల్ల తెగులు సోకిన భాగాల నుంచి బాక్టీరియా నీటిలోకి స్రవించడం వల్ల కొద్ది గంటల తరువాత నీటి గాఢత పెరగడం, పసుపు రంగుకు మారడం జరుగుతుంది. ఈ లక్షణాలను బట్టి ఆ పంటను బాక్టీరియా ఆకు ఎండు తెగులు ఆశించినట్లుగా గుర్తించాలి. అదే ఆరోగ్యవంతమైన ఆకులను వేసినప్పుడు ఇటువంటి లక్షణాలు కనిపించవు.

ఈ తెగులు నివారణకు సరైన మందులు అందుబాటులో లేవు. అందుబాటులో ఉన్న బాక్టీరియా నాశినులు కూడా కొంత పరిమితి వరకు మేరకే పనిచేస్తున్నాయి. కావున చివరి ప్రయత్నంగా తెగులు వ్యాప్తిని కొంతవరకు అరికట్టడానికి లీటరు నీటికి 1.0 గ్రా. స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్, టెట్రాసైక్లిన్ హైడ్రోక్లోరైడ్(ప్లాంటోమైసిన్), 2.0 గ్రా. కాపర్ హైడ్రాక్సైడ్ 53.8 డిఎఫ్(కొసైడ్) కలిపి పిచికారీ చేయడం వల్ల కొంతమేరకు తెగులు వ్యాప్తిని అరికట్టవచ్చునన్నారు. అందుబాటులో ఉంటే కాపర్ సల్ఫేట్ పెంటాహైడ్రేట్ 6 శాతం ఎస్‌సి 2.0 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.



ఆట పాట కార్యక్రమం నిర్వహిస్తున్న ఎంఇఒ 2 గాదిరాజు

విద్యార్థుల మనోవికాసానికి డ్యాన్స్ దోహదం

కాళ్ల ఎంఇఒ-2 గాదిరాజు కనకరాజు

ప్రజాశక్తి - కాళ్ల

విద్యార్థుల మనో వికాసానికి, క్రమశిక్షణకు డాన్స్ ఎంతో ఉపయోగపడుతుందని కాళ్ల ఎంఇఒ-2 గాదిరాజు కనకరాజు అన్నారు. కోపల్లె గ్రామంలో ఉన్న మంతెన దుర్గారాజు రాజాయమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వందేమాతరం ఫౌండేషన్, ఐక్య నేషనల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు, ఆటపాట కార్యక్రమం ద్వారా నృత్య శిక్షణా కార్యక్రమం శనివారం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిర్మలాదేవి అధ్యక్షత వహించారు. కాళ్ల ఎంఇఒ-2 గాదిరాజు కనకరాజు మాట్లాడుతూ విద్యార్థులందరూ ఉత్సాహంగా నేర్చుకోవాలన్నారు. బాలబాలికలు 40 మంది ఈ కార్యక్రమంలో పాల్గొని నృత్యాలను నేర్చుకున్నారు. ఆటపాటలతో అద్భుతమైన నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో వందేమాతరం ఫౌండేషన్, కోఆర్డినేటర్ పేరిచర్ల అశోక్, ఐక్య నేషనల్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు వైఎస్ ఆచారి, వందేమాతరం ఫౌండేషన్ కల్చరల్ కోఆర్డినేటర్ బైరాజు బ్రహ్మాచారి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. స్కూల్ ఫస్ట్ అసిస్టెంట్ సుబ్బరాజు, స్టాఫ్ సెక్రటరీ మాణిక్యాలరావు పాల్గొన్నారు.

5 లోపు పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ సంతోష్

గణపవరం: ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు వ్యాధినిరోధక టీకాలు వేయించాలని గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు పి.సంతోష్ అన్నారు. శనివారం నాలుగు సచివాలయాల వద్ద పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. టిడి మొదటి, రెండవ రోజు సకాలంలో తీసుకోవాలన్నారు. ఐరెన్, కాల్షియం మాత్రలు 180 వరకు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి.కిరణ్మయి, సిహెచ్ఒ జాలాది విల్సన్ బాబు, హెచ్‌వి.పద్మజ, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అతిసారతో జాగ్రత్త

ఆకివీడు : వాతావరణంలో వస్తున్న మార్పు, నీటి మార్పు రీత్యా అతిసార ప్రబలే ప్రమాదం ఉందని, ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సూచించారు. శనివారం మండలంలోని దుంపగడప శివారు తిమ్మరాజు కాలనీలో ప్రజలు అతిసార పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. వ్యక్తిగత శుభ్రత పరిసరాల శుభ్రత పాటించాలని తెలుపుతూ ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం నాగలక్ష్మి, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సమన్వయంతో అభివృద్ధికి పాటుపడాలి

సర్వసభ్య సమావేశంలో ఎంపిపి చంటి రాజు

పాలకోడేరు : సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులంతా సమన్వయంతో పనిచేసి మండలం అభివృద్ధికి పాటుపడాలని మండల పరిషత్తు అధ్యక్షులు భూపతి రాజు సత్యనారాయణ రాజు(చంటి రాజు) అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి చంటి రాజు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల వారీగా అధికారులు చేసిన అభివృద్ధి, రాబోయే మూడు నెలల కాలంలో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఎంపిపి చంటి రాజు మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, అవన్నీ పక్కన పెట్టి ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేసి మండలాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. సమావేశంలో ఎంపిడిఒ టి.అనుహ, ఉప ఎంపిపిలు పాల్గొన్నారు.

మూడేళ్ల నుంచి నన్ను పిలవలేదు : జనసేన ఎంపిటిసి సత్యకృష్ణ

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలకు సంబంధించి మూడేళ్ల కాలంలో ఒక్కసారి కూడా తనను పిలవలేదని శృంగవృక్షం జనసేన ఎంపిటిసి సవరం సత్యకృష్ణ ఆరోపించారు. మండల వ్యవసాయ శాఖపై జరుగుతున్న చర్చల్లో భాగంగా ఎంపిటిసి సత్యకృష్ణ ఈ అంశాన్ని లేవనెత్తారు. తమ శాఖ ఆధ్వర్యంలో అటువంటి కార్యక్రమాలు ఏమి జరగలేదని మండల వ్యవసాయ అధికారి వి.నారాయణరావు వివరణ ఇచ్చారు. శృంగవృక్షం పరిధిలో ఉన్న పంట పొలాలు వర్షానికి ముంపు బారిన పడ్డాయని, వాటిని పరిశీలించాలని సత్యకృష్ణ అధికారులను కోరారు. విస్సా కోడేరు సర్పంచి బొల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ గత మూడేళ్ల నుంచి సమస్యలు వివరిస్తున్నా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవట్లేదని తెలిపారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి : ఎంఎల్ఎ

జనసేన వీరమహిళల ఆధ్వర్యంలో వికలాంగులకు రగ్గుల పంపిణీ

భీమవరం టౌన్: సమాజ సేవలో అందరూ భాగస్వాములు కావాలని ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. శనివారం భీమవరం శంకర మఠం ఆంజనేయ స్వామి గుడి వద్ద జనసేన వీర మహిళలు మీసాల నాగదేవి, కరణం కల్యాణి, నిమ్మల అన్నపూర్ణమ్మ, బోడపాటి పెదబాబు, రాట్నల శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో 75 మంది వికలాంగులకు ఎంఎల్ఎ అంజిబాబు చేతుల మీదుగా రగ్గులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం భగవత్ సేవతో సమానమని, వీర మహిళలు ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. వీర మహిళలు మీసాల నాగదేవి మాట్లాడుతూ పట్టణంలోని శీతాకాలం దృష్టిలో ఉంచుకుని 75 మంది వికలాంగులకు రగ్గులు పంపిణీ చేశామని, రానున్న కాలంలో మరెన్నో సేవా కార్యక్రమాలను చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు చెన్నమల చంద్రశేఖర్, జెడ్‌పిటిసి గుండా జయప్రకాష్, గనిరెడ్డి త్రినాథ్, విజ్జురోతి రాఘవులు, జనసేన వీర మహిళలు మీనాక్షి పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా రాణించాలి : కలెక్టర్

భీమవరం టౌన్: మహిళలందరూ జీవనోపాధి మార్గాలను ఎంచుకొని ఆర్థికంగా రాణించాలని, దీనికి ప్రభుత్వ సహాయం ఎల్లప్పుడూ ఉంటుందని జిల్లా కలెక్టర్ సి.నాగరాణి అన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ సి.నాగరాణి డిఆర్‌డిఎ, మెప్మా అధికారులతో సమావేశమై ఆయా శాఖల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాలను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలందరూ ఆర్థికంగా బలోపేతానికి, జీవనోపాధి మార్గాలను ఎంచుకొని రాణించాలన్నారు. లేస్ పార్క్ ఉత్పత్తులను సొసైటీల ద్వారా మార్కెటింగ్ సహాయం తీసుకుని రానున్న రెండు నెలల కాలంలో బలోపేతం చేయాలని ఆదేశించారు. జిల్లా సమైక్య సభ్యులు వివిధ పాఠశాలలకు అవసరమైన హ్యాండ్ వాష్, తదితర వస్తువులను సొంతంగా తయారు చేసి అందించేందుకు ఆలోచన చేయాలన్నారు. ఫిషర్ మెన్ కమ్యూనిటీకి చెందిన మహిళ సమాఖ్య సభ్యులు సోలా డ్రై ఫిష్ యూనిట్స్ నెలకొల్పేందుకు అవసరమైన సహాయాన్ని అందించాలని సూచించారు. త్వరలో బిఎంసియుల పనితీరును స్వయంగా పరిశీలించనునట్లు తెలిపారు. మహిళా మార్ట్‌లో అమ్మకాలు బాగా పెరిగేందుకు చర్యలు తీసుకోవాలని, మహిళా మార్ట్స్ ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను గుర్తించి ఏర్పాటుకు సిద్ధం చేయాలన్నారు. అత్తిలి క్లస్టర్‌లో మంచిలి పూతరేకులు తయారీలో స్త్రీలు కీలకంగా ఉన్నందున మంచిలి పూతరేకుల తయారీని పరిశీలించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎన్ఎస్ఎస్ వేణుగోపాల్, మెప్మా పీడీ గ్రంధి పార్వతి, డిఆర్‌డిఎ, మెప్మా అధికారులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ సేవాధృక్పథంతో మెలగాలి

తహశీల్దార్ ఎన్ఎస్ఎస్ ప్రసాద్

నరసాపురం: ప్రతిఒక్కరూ సేవా ధృక్పథంతో ఉండాలని నరసాపురం తహశీల్దార్ ఎన్ఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. శనివారం నరసాపురం మండలం రుస్తుంబాద గ్రామం లెప్రసి కాలనీలో పేదలకు ఉయ్యూరు ఆర్‌డిఒ దాసిరాజు కుమారుడు సిద్దార్థ పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన పేదలకు అన్నదానం, మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమానికి తహశీల్దార్ ప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. సిద్దార్థ బర్త్ డే కేకును కట్ చేసి పుట్టిన రోజు శుభాకాంక్షలను తెలియజేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ప్రసాద్ మాట్లాడుతూ సమాజానికి దాసిరాజు అందిస్తున్న సేవలను కొనియాడారు. గతంలో నరసాపురం, మొగల్తూరు, పాలకొల్లు తహశీల్దార్‌గా దాసి రాజు పని చేసి, ప్రస్తుతం కృష్ణా జిల్లా ఉయ్యూరు ఆర్‌డిఒగా సేవలు అందిస్తున్నారన్నారు. నరసాపురం ప్రాంతం మీద మమకారంతో ప్రతిసారి ఏదోక సందర్భంలో పేదలకు ఆర్‌డిఒ దాసిరాజు అందిస్తున్న సేవలను అభినందించారు. అదేవిధంగా రాజు తనయుడు సిద్దార్థ జన్మదిన వేడుకలను లెప్రసి కాలనీలోని పేదల సమక్షంలో ఏర్పాటు చేసి పేదలకు అన్నదానంతో పాటు మహిళలకు చీరలు పంపిణీ చేయడం ప్రశంసనీయం అన్నారు. ఈ సేవా కార్యక్రమంలో తనకు భాగస్వామ్యం కల్పించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇటువంటి మంచి సేవా కార్యక్రమాలు ఆర్‌డిఒ మరిన్ని చేయాలని, భగవంతుని ఆశీస్సులు సిద్దార్థకు ఉండాలని కోరుతున్నానని తెలిపారు. రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ యశోద, ఆదరణ ట్రస్ట్ ఛైర్మన్ కృష్ణ భగవాన్, నాగిడి రాంబాబు, కవురు మురళీ, తోట వెంకటేష్ ఉన్నారు.

సిఎస్ఎన్ కాలేజీలో రక్తదానం

భీమవరం టౌన్: భీమవరం పట్టణంలోని సిఎస్ఎన్ కళాశాలలో భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ పశ్చిమ గోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం మన్యం విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంత్యుత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా జిల్లా అధ్యక్షులు కె.ఈశ్వర్, కళాశాల కార్యదర్శి డాక్టర్ చిడే సత్యనారాయణ అల్లూరు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఈశ్వర్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో మహా ఉద్యమం నడిపించి ఆదివాసుల హక్కులకు, దేశ స్వతంత్రం కోసం అల్లూరి వీరోచితమైన పోరాటం చేశారని, ఆయన పోరాట స్ఫూర్తిని నేటితరం యువత ఆదర్శంగా తీసుకొని, సమాజాభివృద్ధికి పనిచేయాలని అన్నారు. అనంతరం డాక్టర్ చీడే సత్యనారాయణ మాట్లాడుతూ అల్లూరి స్ఫూర్తితో ఎస్ఎఫ్ఐ విద్యార్థులు, యువత ముందుకు వచ్చి రక్తదాన శిబిరాలు నిర్వహించడం చాలా అభినందనీయమని తెలియజేశారు. ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి గణేష్ మాట్లాడుతూ విద్యార్థులు కులమత విభేదాలు లేని సమాజం, ఆర్థిక అసమానతలు లేని సమాజం, దోపిడీ లేని సమాజం కోసం పోరాడటమే అల్లూరికి మనమిచ్చే నిజమైన నివాళి అని అన్నారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో 60 విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎస్.సత్యనారాయణ, అధ్యాపకులు, ఎస్ఎఫ్ఐ నాయకులు జి.శ్రీను, పి.భవ్య, బి.చిరంజీవి, ఎస్.లక్ష్మణరావు, ఎం.యశ్వంత్, ఎం.వరుణ్, ఎం.అనిరుధ్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

'డిమాండ్స్ డే'ని జయప్రదం చేయాలి

భీమవరం టౌన్: దేశవ్యాప్తంగా ఈనెల 10న డిమాండ్స్ డేని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి గోపాలన్ పిలుపునిచ్చారు. మండలంలో శనివారం సిఐటియు కార్యాలయంలో సిఐటియు మండల కమిటీ సమావేశం మండల అధ్యక్షులు గోవిందమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి గోపాలన్ మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను మార్చివేసి యాజమాన్యం అనుకూలంగా నాలుగు లేబర్ కోడులు తీసుకొచ్చిందన్నారు. కార్మికులంతా నాలుగు లేబర్ కోడ్‌లను వ్యతిరేకించాలని తెలిపారు. స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, డిమాండ్ చేస్తూ ఈనెల 10వ తేదీన ఎంఆర్ఒ ఆఫీస్ వద్ద జరిగే డిమాండ్స్ డేలో స్కీం వర్కర్లు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిఐటియు మండల కార్యదర్శి ఇంజెటి శ్రీనివాస్, కె.విశాలాక్షి పాల్గొన్నారు.

ఆకివీడు : ఈనెల 10వ తేదీన దేశవ్యాప్తంగా జరుగుతున్న డిమాండ్స్ డేని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి వాసుదేవరావు పిలుపునిచ్చారు. సిఐటియు అనుబంధ స్థానిక బజార్ ముఠా కార్మికుల సాధారణ సమావేశం శనివారం స్థానిక సంఘ కార్యాలయంలో మనిపూరి సత్యం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న వాసుదేవరావు మాట్లాడుతూ లేబర్ కోడ్‌లను అందరూ వ్యతిరేకించాలని తెలిపారు.

పలుచోట్ల విజిలెన్స్ అధికారుల తనిఖీలు

పెనుగొండ: రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు(రసాయన) మందులు అందించాలనే లక్ష్యంతో వ్యవసాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో ప్రత్యేక తనిఖీల బృందాలను ఏర్పాటు చేసిందని విజయనగరం జిల్లాకు చెందిన సహాయ వ్యవసాయ సంచాలకులు కె.మహారంజన్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా మండలంలోని అధికార బృందం అకస్మాత్తుగా కొన్ని దుకాణాల తనిఖీలు నిర్వహించారు. షాపుల్లో లైసెన్సులు, రికార్డుల స్టాకులను పరిశీలించగా ఎటువంటి రికార్డులకు ఆధారాలు లేకపోవడంతో రూ.31, లక్ష 57 వేల విలువైన 10.2 టన్నుల పురుగుమందులను విక్రయాలను నిలిపివేసారని వ్యవసాయ సంచాలకులు తెలిపారు ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి.స్పందన, జిల్లా వ్యవసాయ టెక్నికల్ ఎఒ కృష్ణకాంత్ ఉన్నారు.

ఆచంట: మండలంలో వ్యవసాయ, విజిలెన్స్ శాఖ అధికారులు విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల షాపులను శనివారం సాయంత్రం ఆకస్మిక తనిఖీ చేశారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ ఆదేశాల ప్రకారం ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. ఆచంట మండలంలో దివ్య సాయి ఏజెన్సీస్ షాప్‌లో ఆకస్మిక తనిఖీ నిర్వహించగా విరుద్ధంగా ఏమీ గుర్తించలేదని తెలిపారు.

స్వర్ణోత్సవం విజయవంతం చేయాలి

ఉండి: కెవికెలో ఈనెల 8వ తేదీన జరిగే స్వర్ణోత్సవ కార్యక్రమంలో వరి విత్తనోత్పత్తి చేసే రైతులు, ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కెవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.మల్లికార్జునరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంప్రదాయ పద్ధతులలో సాగుచేసే రైతులు తీవ్ర నష్టాలకు గురవుతున్న సమయంలో అత్యాధునిక పద్ధతులలో వ్యవసాయం చేసి రైతులను లాభాల బాట పట్టించేందుకు 1974 మార్చి 21వ తేదీన కృషి విజ్ఞాన కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, నాటి నుంచి నేటి వరకు దేశంలో సుమారు 731 కృషి విజ్ఞాన కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. దేశంలో వ్యవసాయ రంగంలో రైతులను బలోపేతం చేయడంలో కృషి విజ్ఞాన కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు.

కేన్సర్‌పై అవగాహన కల్పించాలి

భీమవరం టౌన్: క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని డాక్టర్ సిహెచ్.ధనలక్ష్మి అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వారి ఆధ్వర్యంలో కాన్సర్‌పై అవగాహన కల్పించడం కోసం వైద్య శాఖ సిబ్బందికి శిక్షణా తరగతులను గతనెల 13వ తేదీ నుంచి జులై వరకూ జిల్లాలోని అన్ని ఏరియా ఆసుపత్రుల్లో ఎఎన్ఎంలు, మెడికల్ ఆఫీసర్లకు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లకు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. దీనిలో భాగంగా శనివారం భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిలో శిక్షణ తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లా వైద్యాధికారి డి.మహేశ్వరరావు పర్యవేక్షణలో జరుగుతున్నాయని తెలిపారు.